క్లుప్తంగా

శివాలయంలో పూజలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్ట కామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన, గోపూజ జరిపారు.
శివుడిని దర్శించుకున్న అడిషనల్ డీఆర్‌డీఓ
శివుడిని అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అర్చకులు స్వాగతం పలికి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి శేష వస్త్రం, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, ఆలయ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఏపీఓ శైలజ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడ ట్రాఫిక్ ఎస్‌ఐగా అంజిరెడ్డి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ అంజిరెడ్డి

కోదాడరూరల్ : కోదాడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా అంజిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట వీఆర్‌లో ఉన్న అంజిరెడ్డి కోదాడకు రాగా ఇక్కడ పనిచేసిన మల్లేష్ సూర్యాపేట వీఆర్‌కు అటాచ్ అయ్యారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. పట్టణ ంలో ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తానని తెలిపారు.

ట్రాన్స్‌కో ఏఈగా రవివర్మ


బాధ్యతలు స్వీకరించిన ఏఈ రవివర్మను సత్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

నేరేడుచర్ల : ట్రాన్స్‌కో నేరేడుచర్ల మండల ఏఈగా రవివర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఏఈ పందిరి శ్రీనివాస్ పాలకవీడు మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి రవివర్మ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఏఈ రవివర్మ, బదిలీపై వెళ్లిన పందిరి శ్రీనివాస్‌ను విద్యుత్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో రజత పతకం


కళ్యాణచక్రవర్తిని అభినందిస్తున్న సీఐ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ కళ్యాణచక్రవర్తి ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన రెండవ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో నేర పరిశోధనకు సంబంధించి పోర్ట్రెట్ పార్లే విభాగంలో రజత పతకం సాధించాడు. దీంతో సోమవారం ఆయనను హుజూర్‌నగర్‌లో సీఐ చరమందరాజు, ఏఎస్‌ఐలు, సిబ్బంది అభినందించారు.

స్కూల్ బ్యాగులు అందజేత


విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న వెంకటరెడ్డి

గరిడేపల్లి : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రధానోపాధ్యాయుడు రాజారావు, మాజీ సర్పంచ్ సాముల వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని సర్వారం ప్రాథమికోన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులకు సాముల కళావతి జ్ఞాపకార్థం సాముల వెంకటరెడ్డి సోమవారం స్కూల్ బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవిందు, వెంకటేశ్వర్లు, సైదులు, మల్లారెడ్డి, నాగేశ్వరరావు, బాలసైదిరెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషోర్, వీరస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పలువురిపై కేసు నమోదు

మోతె : అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై, పేకాట ఆడుతూ పట్టుబడిన వ్యక్తులపై మోతె పోలీసులు సోమవారం కేసులు నమోదు చేశారు. ఎస్సై టి.అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలంలోని అన్నారిగూడెం శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని సీజ్ చేసి, ఇసుక ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేశారు. మోతె మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు, రూ.1900 నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలుకూరు : మండలంలోని బేతవోలు సబ్‌స్టేషన్‌లో బేతవోలు ఫీడర్‌కు బ్రేకర్స్ ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధ్వానంగా కాల్వ కట్ట

నడిగూడెం : మండల పరిధిలోని సాగర్ ఎడమ కాల్వ కట్టలు అధ్వానంగా మారాయి. కట్టలపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. గుంతల్లో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో పాటు వ్యవసాయ మోటార్ల నుంచి నీరు లీకవుతుండడంతో కట్టలపై నిలుస్తోంది. ప్రధానంగా కృష్ణానగర్ డీప్‌కట్ ప్రాంతం నుంచి రామాపురం, చాకిరాల, సిరిపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల వరకు సాగర్ ఎడమ కాల్వకు ఇరువైపులా కట్టలపై లోతైన గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రైతులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కట్టలపై మట్టిపోసి చదును చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.


చాకిరాల నుంచి సిరిపురం మధ్య సాగర్ ఎడమ కాల్వ కట్టపై ఏర్పడిన గుంతలు

కల్వర్టు ఇలా.. రాకపోకలు ఎలా?

నడిగూడెం : మండల కేంద్రంలో గత ఏడాది సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు ఎస్సీ, బీసీ కాలనీల మధ్య ఉన్న వాగుపై కల్వర్టు దెబ్బతిన్నది. దీంతో నాటి నుంచి ఆ వంతెనకు ఎలాంటి మరమ్మతులు చేపట్టపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


నడిగూడెంలో ఎస్సీ, బీసీ కాలనీల మధ్య గల వాగుపై దెబ్బతిన్న వంతెన

'ఉపాధి'పై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

మేళ్లచెరువు : మండలంలో ఏప్రిల్, 1, 2024 నుంచి మార్చి, 31, 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.44.19 లక్షలతో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీపై సోమవారం మేళ్లచెరువు మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ యస్.శిరీష సమక్షంలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో చేసిన ఉపాధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీల్లో ఏఏ గ్రామాల్లో ఎంత మేరకు తప్పిదాలు చోటు చేసుకున్నది సామాజిక తనిఖీ బృందాలు అధికారులకు వివరించారు. మొత్తం రూ. 1,31,945 తప్పిదాలు జరగగా, రూ.16,000 పెనాల్టీ విధించి, రూ.1,15,945 రికవరీకి ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ ఆశ, ఎంపీడీఓ అస్గర్‌అలీ, ఎంపీఓ జగదీష్‌కుమార్, ఏపీఓ శైలజ, సందీప్‌రెడ్డి, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా పోతరాజు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గిరిజనులు

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండా వద్ద గల దుబ్బలగట్టుపై ఉన్న గిరిజనుల ఆరాధ్యదైవం బంగారు మైసమ్మ దేవాలయం ఆవరణలో సోమవారం జనా మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో పోతరాజు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి పానుగోతు మిర్యాలి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ మాలోతు భిక్షానాయక్, మాజీ సర్పంచ్‌లు భూక్యా రాయసెల్, కోట్యానాయక్, కిషన్‌నాయక్, జనానాయక్, మాళోతు బాబునాయక్ పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలని ఆందోళన


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

గరిడేపల్లి : తమ పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సోమవారం గరిడేపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ మాట్లాడుతూ.. జీపీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం దానిని అమలు చేయకపోగా మూడు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తుండడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి నెల వేతనాలు వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధు, నాగచారి, రామస్వామి, వెంకటరత్నం, లక్ష్మయ్య, విజయమ్మ, సైదులు, లచ్చిరాం, గుర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభరెడ్డి పోరాటం మరువలేనిది

కోదాడరూరల్ : ప్రగతిశీల భావాలతో పౌరహక్కుల రక్షణ కోసం హైకోర్టు న్యాయవాది, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దివంగత పద్మనాభరెడ్డి చేసిన పోరాటం మరువలేనిదని పలువురు న్యాయవాదులు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని కోర్టులో కోదాడ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పద్మనాభరెడ్డి 12 వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పద్మనాభరెడ్డి.. పేద, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం హైకోర్టులో నిరంతరం న్యాయపోరాటం సాగించి బాధితులకు అండగా నిలిచేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గట్ల నరసింహరావు, కోదాడ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, కార్యదర్శి వెంకటాచలం, సుధాకర్‌రెడ్డి, శరత్‌బాబు, యశ్వంత్, వెంకటేశ్వర్లు, నరసయ్య, హేమలత, మురళీ, శ్రీధర్, వెంకన్న, పెద్దబ్బాయి ఉన్నారు.


పద్మనాభరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ధర్మస్థలి ఘటనపై విచారణ జరిపించాలి


మాట్లాడుతున్న ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక

నేరేడుచర్ల : కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలి పుణ్యస్థలంలో వెలుగులోకి వచ్చిన ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి, అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రగతి శీల మహిళా సంఘం సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక డిమాండ్ చేశారు. సోమవారం నేరేడుచర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత రెండు దశాబ్దాలుగా సుమారు 300 మందికిపైగా అమ్మాయిలు, మహిళలను అత్యాచారం చేసి పూడ్చిపెట్టి విషయం బయటకు రాకుండా ప్రభుత్వ పెద్దల సహకారంతో కప్పిపుచ్చుతున్నారని ఆరోపించారు. చివరికి ఒక పారిశుద్ధ్య కార్మికుడు ధైర్యం చేసి ఫిర్యాదు చేస్తే ఈ విషయం నేడు బయటి సమాజానికి తెలిసిందన్నారు. పవిత్రమైన ధర్మస్థలలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రేష్మ, శ్యామల, మరియమ్మ, సత్యమ్మ, నాగేంద్ర, మల్లేశ్వరి, మౌలాంబి తదితరులు ఉన్నారు

బిల్లులు అందేది ఇంకెప్పుడు ?

- మోతె మండలంలో 50 పశువుల కొట్టాలు నిర్మాణం
- పాకలు కట్టి మూడు నెలలైనా లబ్ధిదారులకు అందని బిల్లులు


రావిపహాడ్‌లో నిర్మించిన పశువుల కొట్టం

మోతె : పాడి రైతులకు చేయూతనందించేందుకు ప్రభుత్వం ఉపాధి హమీ పథకం ద్వారా పశువుల కొట్టాలు మంజూరు చేస్తోంది. పాడి రైతులు కూడా పశువుల కొట్టాల నిర్మాణానికి ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ సకాలంలో బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు. మోతె మండలంలోని నామవరం, రావిపహాడ్, విభళాపురం, హుస్సేన్‌బాద్, రాంపురంతండా, సిరికొండ, తుమ్మలపల్లితో పాటు పలు గ్రామాల్లో సుమారుగా 50 మంది పాడి రైతులు ఉపాధి హమీ పథకం కింద మూడు నెలల క్రితం పశువుల కొట్టాలు నిర్మించుకున్నారు. కానీ లబ్ధిదారులకు నేటికీ బిల్లులు అందలేదు. సకాలంలో బిల్లులు వస్తాయనే నమ్మకంతో అప్పులు చేసి నిర్మించుకున్నామని, మూడు నెలలుగా బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని వారు అంటున్నారు. కొట్టాలు పూర్తయిన వెంటనే బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో విడతల వారీగా జమ అవుతాయని అధికారులు చెప్పారని, నేటికీ బిల్లులు మంజూరు కాలేదని అంటున్నారు. అయితే ఒక్కో పశువుల కొట్టాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకుంటే రూ. 85 నుంచి రూ.90 వేల వరకు అందాల్సి ఉంది. కానీ కేవలం మస్టర్ పేమెంట్ మాత్రమే రూ.1200 ఖతాల్లో జమ అయ్యాయని మెటీరియల్ బిల్లు ఊసే లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. బిల్లులు వెంటనే మంజూరు చేయిలని కోరుతున్నారు.

అప్పు తెచ్చి నిర్మించాం

ఉపాధి హామీ పథకం ద్వారా మాకు పశువుల కొట్టం మంజూరు కావడంతో అప్పు తెచ్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించాం. పాక నిర్మించి మూడు నెలలు గడుస్తున్నా బిల్లు మాత్రం మంజూరు కాలేదు. అధికారులు చొరవ చూపి బిల్లులు జమ చేయాలి. - కె.మల్లమ్మ, రావిపహాడ్

పది రోజుల్లో బిల్లులు జమ అవుతాయి

పశువుల కొట్టాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు వారం, పది రోజుల్లో బిల్లులు వారి అకౌంట్‌లలో జమవుతాయి. ప్రభుత్వం నుంచి బిల్లులు విడతల వారీగా అందించడం వల్ల ఆలస్యమవుతోంది.
- నగేష్, ఏపీఓ, మోతె

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

చిలుకూరు : బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ హుజూర్‌నగర్ సెక్టార్ సీడీపీఓ వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం చిలుకూరులోని అంగన్‌వాడీ సెంటర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుశీల, సూపర్‌వైజర్ సునిత, అంగన్‌వాడీ టీచర్ సిరికొండ కవిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలి
నేరేడుచర్ల : పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని అంగన్‌వాడీ టీచర్ ఐశ్వర్య అన్నారు. సోమవారం నేరేడుచర్ల మండలం సోమారం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు అనూష, కళావతి, అంగన్‌వాడీ టీచర్ల కళావతి, సంధ్య, ఆయాలు సంతోషమ్మ, రత్తమ్మ తదితరులు ఉన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన
హుజూర్‌నగర్ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా హుజూర్‌గర్‌లోని మగ్దుంనగర్‌లో, పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మేరీ, కళారాణి, ఆకుల రజని మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టించాలని అన్నారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు, ఆయాలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డబ్బాపాలు వద్దు.. తల్లిపాలు ముద్దు
మునగాల : బిడ్డకు డబ్బాపాలు వద్దు, తల్లిపాలే ముద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బెజవాడ సరిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం మునగాల మండల కేంద్రంలోని నాలగవ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులు, బాలింతలకు అవగాహన కల్పించి మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని ఇద్దరు చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గన్నవరపు సంధ్యారాణి, మాణిక్యం, ఎల్లమ్మ, కమల, రూప, మణి, ఆశావర్కర్ జి.వనజ పాల్గొన్నారు.


చిలుకూరు : ఆస్పత్రిలో బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న సీడీపీఓ వెంకటలక్ష్మి


మునగాల : చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ సరిత, పాల్గొన్న టీచర్లు


హుజూర్‌నగర్ : చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్


నేరేడుచర్ల : సోమారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో..

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

కోదాడరూరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని వాటి సాధన దిశగా ముందుకెళ్లాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర సూచించారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ఐఐటీ, మెడికల్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల కెరీర్ గైడెన్స్, పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటర్మీడియట్ నుంచి ఆరు సంవత్సరాలు ఇష్టంగా చదివితే ఆతర్వాత జీవితం అంతా సాఫీగా సాగుతుందని చెప్పారు. సమాజంలో అసమానతలను తొలగించే శక్తి కేవలం చదువుకు మాత్రమే ఉందని , ఉన్నతమైన ఉద్యోగం సాధిస్తే మర్యాద, గౌరవం లభిస్తుందని తెలిపారు. చెడు వ్యసనాలకు, ఆకర్షణలకు లోనవకుండా చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వడ్డె రాజేష్‌చౌదరి, డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపల్ జీ.వీ, అకడమిక్ డైరెక్టర్ మైనం రామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర

కరాటే పోటీల్లో కోదాడ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న స్టూడెంట్ కోఫోఖాన్ కరాటే క్లబ్ విద్యార్థులు

కోదాడరూరల్ : ఖమ్మంలో జరిగిన సౌత్ ఇండియా డబ్ల్యూఎఫ్‌ఎస్‌కేఓ (వరల్డ్ ఫునాకోషి షూటోఖాన్ కరాటే ఆర్గనైజేషన్) కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కోదాడకు చెందిన స్టూడెంట్ కోఫోఖాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. 12 మంది విద్యార్థులు గోల్డ్, ఇద్దరు సిల్వర్, నలుగురు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు కోచ్ ఆరె.మాధవిలత సోమవారం తెలిపారు. విజేతలైన విద్యార్థులు.. టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ షిహాన్ సందేశ్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

మునగాల : మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం పది గంటలకు ×వరి సాగులో నేరుగా విత్తనాలు విత్తే పద్ధతి, పామాయిల్ పంటలో యాంత్రీకరణ పద్ధతులు¿అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించనున్నట్లు మండల వ్యవసాయాధికారి బుంగా రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మునగాల, ఆకుపాముల, రేపాల, నేలమర్రి క్లస్టర్ పరిధిలోని రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

సుభద్రకు నివాళి

మోతె : మండలంలోని విభళాపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ దామళ్ల ఉప్పలయ్య భార్య సుభద్ర అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సుభద్ర మృతదేహాన్ని ఎంపీడీఓ ఆంజనేయులు, ఉపాధి హామీ సిబ్బంది, విభళాపురం గ్రామానికి చెందిన పలువురు నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, ఏపీఓ నాగేష్, ఈసీ శ్రీహరి, టెక్నికల్ అసిస్టెంట్లు రామయ్య, ఉమ్లానాయక్, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీనివాస్, మల్సూర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

హుజూర్‌నగర్ : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం, ప్రజాసంఘాలు నిరంతరం పోరాటాలు చేస్తున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో వివిధ మండలాల పార్టీ కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అఖిల భారత మహాసభలలో తీసుకున్న క్షేత్రస్థాయి పోరాటాల రూపకల్పనపై జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో తగు నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యాకూబ్, సైదులు, హుస్సేన్, బాలు, శ్రీను పాల్గొన్నారు.

ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే


గ్రీవెన్స్ డేలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ బండ కవిత

గరిడేపల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బండ కవిత తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఆమె మాట్లాడారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను గ్రీవెన్స్ డేలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంఈఓ శత్రునాయక్, డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, రాంబాబు, ప్రవీణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి ఉత్తమ్

గరిడేపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ కార్యకర్త కుటుంబాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదుకున్నారని మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానికంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని గానుగబండకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఈద నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరాడని, ఈ విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆతని వైద్యానికి రూ.8 లక్షల సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఎల్‌ఓసీ అందజేసి అండగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాకాల పరమేష్, అంజిరెడ్డి, నాగేంద్రబాబు, చింతకాయల శ్రీను, గోపయ్య, దస్తగిరి, సాయి, నవీన్, వెంకటరెడ్డి, సాయికిరణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నేరేడుచర్ల : విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన సోమవారం నేరేడుచర్ల మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని జగనతండాలో ఆదివారం రాత్రి ఈదురుగాలులు, వర్షానికి విద్యుత్ వైర్లు తెగి రమావత్ నరేష్‌కు చెందిన పశువుల కొట్టంపై పడి ప్రమాదవశాత్తు ఆవుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధితుడు నరేష్ తెలిపారు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చానని, తనను ఆదుకోవాలని కోరాడు.

కొనసాగుతున్న 'వందరోజుల ప్రణాళిక'

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలోని 11వ వార్డులో గల చింతలబజారులో తడి, పొడి చెత్త వేరు చేయా విధానంపై ఆర్‌ఓ శ్రీనివాస్‌రావు ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్ల వెంట పిచ్చిమొక్కలు, డ్రెయినేజీలో సిబ్బంది పూడికతీత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆర్‌పీలు, సంఘాల మహిళలు ఉన్నారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్ నివారణపై అవగాహన

మేళ్లచెరువు : మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం చింతలపాలెం పరిధిలోని సీతా మెమోరియల్ పాఠశాలలో డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ కళాజాత బృందం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కష్టపడి చదువుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

పాలకవీడు : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ముఖ్యంగా జాన్‌పహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తండాలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. మురుగు రోడ్లపైనే పారుతోంది. దీంతో భరించలేని దుర్వాసన వస్తోందని స్థానికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఊరంతా డెంగీ బారిన పడి మంచానికే పరిమితమయ్యామని, ప్రస్తుత వర్షాకాలంలో పారిశుద్ధ్యాన్ని పట్టించుకోకపోతే సీజనల్ వ్యాధులు ప్రబలడం ఖాయమని చెబుతున్నారు. వర్షం పడితే వీధుల్లో నీరు నిలిచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో మురుగు కాలువల్లో పూడికతీసే సిబ్బంది కరువయ్యారని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు సీసీరోడ్లు, డ్రెయినేజీలకు మరమ్మతులు చేయించాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కోరుతున్నారు.


కొత్తతండాలో అధ్వానంగా మురుగు కాలువ